# కదనకుతూహలం

మందర క్రాపింగు వెనక గుండు వున్నవాళ్లు మద్రాసులో కొందరుంటారు. కొందరికి ముందు వసారా దింపినట్లు గుండు, వెనక జడదువ్వుకునే లక్షణమైన జుట్టు ఉంటుంది.

కొత్త ఇల్లు కడితే కూలీలు మేస్త్రీలు విశేషంగా దోచేస్తారు. ఇల్లు కట్టినవాడూ గాడిద ఎక్కినవాడు ఒకటేనని వాళ్ల నాన్న అన్నాడట. ఇంట్లో అన్నీ జీరోవాట్ బల్బులే-మనుషులు ఇంట్లో తిరుగుతూంటే ఏవో భూతాలో మరోటో తిరుగుతున్నట్లుగా రోతగా ఉంటుంది. వంట భోజనాలు దీపం పెట్టకుండా అయి పోతే మంచం ఎక్కి పడుకోవడమే. పిల్లలు చదూకోడానికి ఇబ్బందిగా ఉంటున్నది. అంటే వీధిలో స్ట్రీట్‌లాంప్ కింద కూచుని చదూకుంటే మంచిది అనేవాడు. అలా చదువుకున్న వారే జీవితంలో పెద్ద పెద్ద వాళ్లయి కీర్తీ డబ్బూ పుష్కలంగా గడించాడన్నారు.

భౌభౌరావుకి తల్లి పెట్టుకున్న అసలు పేరు బాబూరావు. (కాని వేళాకోళానికి అతని మిత్రులు భౌభౌ రావుగా మార్చారు.) బాబూరావు తల్లి రంగమ్మ కొడుకుని మొగలి పువ్వులా పెంచుకొచ్చింది. రంగమ్మది పేడిమొహం. ఆవిడ పోలీసు సబిన‌స్పెక్టర్ వేషం వేసిన చాకలి పేరిగాడులా ఉంటుంది. ఆవిడ చీరకడితే మగవాడు ఆడవేషం వేసినట్లుగా ఉంటుంది. చిత్రంగా ఆవిడ మాజీ హాస్యనటుడి భార్య. ఆయన హాస్యనటుడు గనుక స్త్రీ సంబంధాలు ఎక్కువ. రంగమ్మను ఒక ఎక్స్‌ట్రాను చూసినట్లు చూసేవాడు. భర్తమీద కసినుంచి ఆవిడకు కొడుకు మీద ప్రేమ పుట్టింది. ఆ ప్రేమలో కాపీర్నం ఉంది. ఆవిణ్ని భర్త హింసించాడు గనుక ఆ శాడిజం అంతా ఆవిడ మాటలో నడకలో ప్రవర్తనలో ప్రతిబింబించింది.

కొందరు సమర్తబంతి కూడా పెద్ద హడావిడిగా చేస్తారు. వాళ్ల వీధికి వెనక వీధిలో

ఓ కుటుంబం వుంది. వాళ్ల జాతి వేరు. గీత 'బంతికి వెళ్లొస్తానత్తయ్యా' అని హైకమాండ్ పర్మిషనడిగింది. వెళ్లిరామ్మా అని కౌసల్యాదేవి సీతకు చెప్పినట్లు గీతకు రంగమ్మ తిప్పుకుంటూ చెప్పింది. గీత చాలా సరదాగా పిల్లల్ని కూడా తీసుకుని పిల్లలకోడిలా ఆ బంతి పేరంటానికి వెళ్లింది.

భౌభౌరావుకి కంపెనీవారు కారుకొనుక్కోడానికి డబ్బిచ్చారు. వద్దంటే ఆ డబ్బు దక్కదు. వడ్డీ ఫ్రీగా ఎవడు వేలకు వేలు సొమ్ము ఇస్తారు? చచినట్లు ఆ డబ్బుకి ఒక స్కూటరు, ఒక సెకండుహేండు చిన్న కారు వచ్చింది. ఆ కారు ఇంటి దగ్గర అలంకారప్రాయంగా ఉంటుంది. అతను ఆఫీసుకు సొంతపనులమీద స్కూటరుపై తిరుగుతాడు. స్కూటరు మీద ఎవరికైనా ఎప్పుడైనా లిఫ్టిస్తే వాళ్ల దగ్గర పోస్టుకార్డులో, కవర్లో, చదువుకోడానికి పాత మేగజైన్లో ఏదో ఒకటి ముందుగా తీసుకుంటాడు. ఈ ప్రపంచంలో ఏదీ ఉచితంగా లభించదు. ప్రతిదానికీ దాని ఖరీదు ఒకటి ఉంటుంది. ఇచ్చిపుచ్చుకోడాలన్నీ కొనడాలు-అమ్మడాలేనంటాడు. ధర్మం, న్యాయం, అన్యాయం అనేవి ఉండవు. ఈ సమాజంలో వుండేవి లాభనష్టాలే నంటాడు. దారిలో స్కూటరు కాస్త ట్రబులిచ్చింది. మెకానిక్ కాస్త ఖర్చు పెట్టించాడు. ఇంటికి వచ్చేసరికి గీత, పిల్లలూ ఎక్కడో సమర్త పేరంటానికీ, బంతికీ కూడా వెళ్లారు. తల్లి చెప్పింది, వాళ్లు మనజాతివాళ్లు కారట. అక్కడకు బంతి భోజనానికి కూడా వెళ్లింది. గీత అత్తగారి మాటను ఖాతరు చెయ్యదు అని తెలిసి భౌభౌ రావు హీటెక్కిపోయాడు. అతనికి మదరే దైవం. పెళ్లాం వికృతి.

గీతకాస్త వెర్రిబాగుల్ది. దానికి చక్కగా పాటలు పాడ్డం వచ్చు. ఆడవాళ్లపాటలు రకరకాలుగా పాడుతుంది. సవర్త బంతి దగ్గర గీత చేత పాటలు రకరకాలుగా పాడించుకుని గాని వాళ్లు వదల్లేదు. రవికలగుడ్డ పెట్టారు. పిల్లలకి ఇంటి దగ్గర తినమని చిమ్మిలి, లడ్డూలు, అరిసెలు ఇంకా ఏవేవో ఇచ్చారు.

కాగాక పెనం మీద నీళ్లు జల్లితే ఎలా చురచురమంటుందో అలా కాగిపోయివున్న భౌభౌ రావు పెద్ద కంపెనీలో సీనియర్ ఇంజనీరు. మరో జాతివారింటికి తగుదునమ్మా అని అత్తమాట వినకుండా తిండికి మొహం వాచినట్లు తిని అది ఇంటికి పట్టుకువస్తావా అన్న మంటతో, గీతని జుట్టట్టుకు యీడ్చి డొక్కలో తన్ని గోడకేసి కొట్టాడు తలను.

'అమ్మో...అమ్మో' అని కేకలేసింది. తినుబండారాలన్నీ చిందర వందర అయ్యాయి. పిల్లలు గోడకతుక్కు పోయారు.

అడ్డమైన వాళ్ళింటికి భోజనాల కెళ్లడమేమిటి? పిల్లల్నితీసుకుని. ఆచారం ఓ పద్ధతి అంటూ లేదా?" అని అత్తగారు కొడుకులో రాజుకున్న మంటల్లో ఆజ్యం పోసింది.

ఎద్దుకుమ్మినట్లు రెచ్చిపోయి కుమ్మేశాడు భౌభౌ రావు. గీత ఈజ్ టర్న్ టు పీసెస్. అసలే ఆవిడ అర్భనాకారాపు మనిషి. చాలా నీరసంగా పుల్లల్తో చేసిన పెళ్లి కూతుర్లా

ఉంటుంది. పన్లో పనిగా కుర్రాళ్లకు కూడా 'నాయనమ్మ మాట వినకుండా భోజనాల కెళ్లినందుకు' బాగా తగలనిచ్చాడు. తండ్రి ఇంట్లోకి వస్తున్నాడంటే ఒక మదించిన ఆబోతు కుమ్మడానికి వస్తున్నట్లు పిల్లలు భీతిల్లి బల్లుల్లా గోడకంటుకుని బిక్కచచ్చిపోయారు.

గీత చిన్నప్పుడు కాన్వెంటుల్లో చదివింది. ఆవిడకు మనుషుల మధ్యగల జాతి భేదాలూ, తారతమ్యాలూ, ఎక్కువ వాళ్లూ తక్కువ వాళ్లూ అర్థం కాదు. అది పాపమనీ, శిక్షించదగిన అపరాధమనీ కూడా తెలీదు.

ఇంటిముందు వీధిలోని కొబ్బరి చెట్టు నిటారుగా ప్రశ్నలా నిలబడి అటూ ఇటూ దిక్కులు చూస్తున్న తల విరబోసుకున్న ఆడదానిలా వుంది. అప్పుడప్పుడు ఆ కొబ్బరి చెట్టు కాయలు రాలుస్తూ ఉంటుంది వీధిలోకి. అవి పట్టుకుని ఇంట్లోకి తెచ్చి పచ్చడి చేస్తూ ఉంటుంది రంగమ్మ. ఆ కొబ్బరి చెట్టు కూడా హాస్యనటుడి పెళ్ళానికి తగ్గట్టుగా అల్లరి పెట్టేస్తూ ఉంటుంది. పెళ్ళాన్ని బంతిని తన్నినట్లు తన్ని వీధిలోకి గెంటేసి తలుపేసుకున్నాడు భౌభౌ రావు. పిల్లలు లోపల్నుంచి గోల. దెబ్బలు తగిలి నెత్తురోడుతున్న చీరతో గీత ఒకర్తీ ఆటో ఎక్కి ఊళ్లో వున్న పుట్టింటికి వెళ్లిపోయింది. అన్నదమ్ములు ఖర్చునిచ్చుకుంటారు.

గీత కాసేపు ఏడ్చింది. భర్తను తిట్టుకుంది. అత్తగారు ముందు వెళ్లమని చెప్పి తరువాత నంగనాచిలా కొడుక్కి కోడలు మీద ఎగదోసింది. ఈ కథంతా పుట్టింటి వారు గీత నుంచి రాబట్టారు. దక్షయజ్ఞంలో పార్వతి దుస్థితిని విని తిరగబడటానికి వీరభద్రుడున్నాడు. ఇవన్నీ అన్నగారి భార్య కామాక్షి వింది.

అన్నగారు 'సాయిరాం–సాయిరాం' అని సత్యసాయి బాబా భజన చేశాడు. ఒక పాట పాడాడు. బాబాకి హారతిచ్చి కొబ్బరికాయకొట్టి ప్రసాదం చెల్లెలి చేతిలో పెట్టి సర్వపాపహరం అన్నాడు. బాబాగార్ని నమ్ముకుంటే విముక్తి లభిస్తుందన్నాడు.

మొగుడు కొడితే దానికి ఆధ్యాత్మిక పరిష్కారం ఏమిటి? అని కామాక్షి అభిప్రాయం. ఆవిడ కూడా బాబా భక్తురాలే గాని, బాబా బాబాయే, దెబ్బలు దెబ్బలే. చిన్నప్పుడు కామాక్షి పరికిణీ ఎగ్గట్టి మగపిల్లల్తో సమానంగా నరసాపురం కాలువలో ఈతలు కొట్టింది. సైకిలు తొక్కింది. స్కూలు ఫస్ట్‌గా ఏడోతరగతి పాసయి ఇక చదువక్కర్లేదు అని తండ్రి అనడం చేత మేనరికం మేనబావ శంభుణ్ని పెళ్లాడింది.

కామాక్షి రెండ్రోజులు గీతకు టైమిచ్చింది. పిల్లలు అమ్మా మనింటికి రా అమ్మా అని బ్రతిమిలాడారు అవతల వైపునించి. అందులో ఓ పిల్లాడికి కళ్లజోడు. ఒకడికి ఒక కన్ను ఆటలో బాణం గుచ్చుకోడం వల్ల పోయి గాజుగుడ్డు వచ్చింది. టీవి రామాయణం, భారతంలో బాణాలు వేసుకోడం చూసి పిల్లలు ఆ ఆటలు ఆడారు.

మీరు వెళ్లి దాని కాపురం చక్కచెయ్యక పోతే నేను వెళ్లి కలుగజేసుకోవాల్సి వస్తుంది.

లౌకిక సమస్యలకు ఆధ్యాత్మిక పరిష్కారం ఉండదు. ఈ గీతని తిరిగి ఆ పులి గహ్వారం లోకి తెలిసి తెలిసీ విడిచిపెట్టాలంటే గీత దుస్థితికి కామాక్షికి జాలేసింది. ఇంజనీరంటే సెక్యులర్‌గా ఉండాలికదా, ఆ కంపెనీలో పేరు తెచ్చుకుని నాలుగునించి ఐదంకెల జీతానికి ఎగబాకేలా ఉన్నాడు. ఇంట్లో అర్థంలేని సంప్రదాయ జీవితం. ఆచారాలు. మనదేశంలో చాలామంది శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు అంతా బయట ఒకలాగా ఇంట్లో మరొకలాగా జీవిస్తారు. ఈ తేడా వారి సంస్కారాన్ని ఏమీ బాధించదు.

కొడుకు 'కళ్లజోడు కావాలి నాన్నా' అంటే సెంట్రల్ స్టేషన్‌కి వెళ్లి అడుక్కోమన్నాడు తండ్రి. పిసినిగొట్టు వాడు ఎవరికోసం కూడ బెడుతున్నాడో, ఏం చేస్తున్నాడో అంతా అసాంఘికం. కళ్లుకనబడకపోయినా ఎల్లాగో అల్లా బతుకీడుస్తున్నాడు.

కామాక్షిది మంచి పర్సనాలిటీ. తెల్లారగట్ల లేచి రాత్రి పదకొండు గంటలదాకా వండుతూ వారుస్తూ వడ్డిస్తూ ఎవరికేది కావాలో అది చేసి పెడుతూ సతమతమవుతూ ఉంటుంది. ఆవిడకు బాబా భక్తి అంతా ఈ దుర్భరమైన రొటీన్ నుంచి విముక్తి. ఏ భక్తి అయినా ఒక రకమైన పలాయనమంత్రం.

సరేపదమని, తనున్నాను భయం లేదనీ, అత్తా మొగుడూ తననేం చేయలేరనీ కామాక్షి గీతకు ధైర్యం నూరిపోసింది. దిగబెట్టిన వదినగారు తనతో కూర్చోదు కదా. ఆ తరువాత అత్తగారు, జిత్తులమారి, కపటి, బహురూపి, దొంగ.

అత్తగారు గుమ్మంలో అర్జునుడి రథం ముందు పేడి కూర్చున్నట్లు కూచుంది. వీళ్ళిద్దరూ ఆటో దిగి గుమ్మంలోకి ఇంకా అడుగు పెట్టకుండానే 'ముండలిద్దరూ వచ్చారే, ఈ ముండ వెళ్లి ఆ ముండను తీసుకొచ్చినట్లుంది' అని మాట తూలింది.

అసలే కామాక్షి వేడిమీద పేలనున్న అగ్నిపర్వతంలా వుంది. "ఎవరే ముండ?" అంటూ కామాక్షి ఎగిరి హాస్యనటుడి ముసలి పెళ్లాం మీద దూకి ముందు జుట్టట్టుకుని తరువాత డొక్కలో తన్నింది. అమెరికన్ బాక్సింగ్ పోటీల్లో కెసియస్‌క్లే ఆడినట్లు ఆడింది. తెలుగు సినిమాలో ఫైటింగ్ సీనులా చాలా తమాషాగా జరిగింది. కామాక్షి బంతితో గోడను కొట్టి ఆడుకున్నట్లు గీత అత్తగారితో ఫుట్‌బాల్ ఆడింది. మారడోనా తలతో, వీపుతో గోల్‌లోకి బంతిని కొట్టేవాడట. నిజం ఫైటింగ్‌లో గీత అత్తగారు ఎప్పుడూ పాల్గొనలేదు. ఆవిడ అలా వెనక నుండి నిప్పును ఎగదోయడమే. ఆవిడ ఇటూ అటూ పరిగెత్తి దాక్కోబోయింది. ఈ అనుకోని ఆకస్మిక పరిణామానికి. జాతకం అలా ఏడిసింది కాబోలు.

కామాక్షి కొట్టిన దెబ్బలకి, గుద్దులకి, తన్నులకి పిల్లలు ఒకటే చప్పట్లు కొట్టి ఎగురుతున్నారు. వాళ్ల నాన్నా, వాళ్ల అమ్మా చేసిన అవమానాలకి అనుకోని హుషారైన

జవాబు. కామాక్షి కిక్కుల్ని తలుపుల చాటునించి వీధిలోంచి ఆడా మగా అంతా ఖరీదు లేని వినోదంగా చూశారు. ఎవరూ 'బుద్దీ' అని అడ్డురాలేదు.

కొబ్బరి చెట్టుమీంచి కాయపడి వీధిలోకి దొర్లింది. ఆ చప్పుడుకి కామాక్షికి తెలివి వచ్చి ఆటోని పిల్చి గీతను ఎక్కించుకుని పిల్లల్తో తన నివాసానికి వచ్చింది. పిల్లలు వాళ్లనాన్నమ్మను అత్త ఎలా చితకబాదిందో యాక్షను చేసి అది ఒక వినోదంలా చెప్పి పగలబడి నవ్వారు.

■

ఇంజనీరు భౌభౌ రావు వచ్చేసరికి మాతాశ్రీ సముద్రంలో విరిగిపోయి పరిత్యజించిన ఓడలా కనబడ్డింది. ఆవిడ కొడుకుని కావలించుకుని గొల్లుమని ఏడ్చింది. తనకు కామాక్షికి మధ్య జరిగిన యుద్ధం గురించి చెప్పి బావురుమంది.

మొదటిసారి భౌభౌరావు తను ఆ సమయంలో ఇంటి వద్ద లేనందుకు నిజంగా సంతోషించాడు.

కామాక్షి తనను కూడా వదిలే మనిషి కాదు.

ఆడవారి చేత తన్నులు తిన్నాడనే ఖ్యాతి రాకుండా తన తల్లి అవన్నీ తనే కాసి తన్ను కాపాడింది.

ఇద్దరూ అనగా తల్లీకొడుకులు తమకు ఈ సంబంధం తెచ్చి వివాహం జరిపించిన పెద్దబావ కావన్నగారింటికి వెళ్లారు. అప్పుడు కావన్నగారు హెూటళ్లలో బాత్‌రూంలో వాడే కొత్తరకం పౌడరుకనిపెట్టారు. ఆ పౌడరుకి నీటిలో కలిపి ఎంత నురగ వస్తుందో కావన్నగారు ఉత్సాహంగా చెప్పుకుపోతున్నారు.

కావన్నగారు మరదలు కామాక్షి సాగించిన సమర వృత్తాంతం భౌభౌరావు చెప్పుకుని తనతల్లికి పట్టిన అవస్థ గురించి చెప్పుకుని కుళ్ళి కుళ్ళి వాపోయాడు.

కావన్న భార్య స్నానపానాదులకు ఏర్పాట్లు చేసి చక్కని భోజనం వడ్డించి తినిపించింది. టి.వీ.లో తెలుగు బొమ్మ చూశారు.

కావన్న మరదల్ని పిలిపించి కేకలేస్తాడని భౌభౌరావు ఆశించాడు.

కావన్నకి శంభుడు వాళ్లకి పడదు. అన్నదమ్ముల మధ్య ఏవో కలతలున్నాయి.

ఆ రోజు వాళ్ళింట్లో సాయిబాబా భజన జరుగుతోంది. అంతా వచ్చారు. భజనలో కావన్న చాలా బాగా పాడాడు. అతను కర్నాటక సంగీతం చిన్నప్పుడు నేర్చుకున్నాడు. భౌభౌ రావూ పాడతాడు.

మీరు గీతను ఇంటికి తీసికెళ్లి జాగ్రత్తగా చూడాలి. కామాక్షి గీతలు కలవకుండా చూడాలి. అది నామరదలు. నాకు ప్రాణాయామం గురించి చెప్పింది. అంతవరకూ ఈ ముక్కులోంచి గాలి పీల్చి ఆ ముక్కులోంచి వదలడం అనుకునేవాణ్ణి.

ఓ వారం రోజులు బావగారింట్లో మకాం వేశారు. తర్వాత ఎవరింటికి వారు 'అమ్మా, అయ్యా', అనుకుంటూ చేరారు. కామాక్షికి మైకం పూర్తిగా దిగిపోయి 'అమ్మయ్య' అనుకుంది.

శంభు ఏదో సినిమాపాట వరసలో వున్న బాబా భజనగీతాన్ని గొంతెత్తి ఆలపించ సాగాడు. ఎవరి భక్తి వారిది.

గీత ఒక్కర్తీ పిల్లల్ని వేసుకుని ఆటోలో ఇంటికి వచ్చి దిగింది. ఇంట్లో ట్యూబులైటును బిగిస్తున్నాడు ఎవడో ఎలక్ట్రీషయను. జీరో బల్బులన్నీ తీసేసి నలభైవాట్ బల్బులు బిగిస్తున్నాడు.

భర్త చాలా ఆదరంగా "నువు ఒక్కర్తివే వచ్చావా?" అని అటూ ఇటూ చూస్తూ అడిగాడు కంపరంతో.

గీత పగలబడినవ్వి "నాకేం భయమా?" అంది.

"ఏవండీ అత్తయ్యా, మీ వొంట్లో ఎలా ఉందీ!" అని అడిగింది గీత. ఆవిడ ఒళ్లంతా కట్లూ, తైలాలు పూసి కట్లపాములా వుంది. "ఏదీ, కామాక్షి వచ్చిందా?" అని చెదురుతూ అడిగింది.

భర్త స్వభావం హఠాత్తుగా మారింది. ఇంత పెద్ద చీఫ్ ఇంజనీరు ఒక ఆడమనిషిచేత తన్నులు తప్పించుకోవడం నిజంగా ఎంత అదృష్టం?

*(విపుల-జనవరి-95)*